# చెంచురాణి

కర్నూలు నుంచి శ్రీశైలము వెళ్ళేటప్పుడు తోవలో నాగలూటి అనే గ్రామమువద్ద యాత్రికులు మజిలీ చేస్తారు. ఆ చిన్న గ్రామములో కాపురమున్న వాళ్ళందరూ చెంచువాళ్ళే. దానికే యీమధ్య బైరాగికట్ట అనీ మొండికట్ట అనీ పేర్లు వచ్చాయి.

నాగలూటిలో దేవాలయము ఉన్నది. దానికి ఎదురుగా నెగళ్ళు వెలిగించి యాత్రికులు రాత్రులు గడుపుతారు. కొందరు దేవాలయ మండపము మీదకెక్కి పడుకుంటారు.

నాగలూటి గ్రామము అడవులమధ్య ఉన్నది. మామిడిచెట్లూ, వెదురుదుబ్బులూ అక్కడ ఎక్కువగా పెరిగి ఉన్నవి. మాఘమాసములో తాండ్రచెట్లు బాగా పుష్పిస్తవి. ఆ పువ్వుల సౌరభము రాత్రివేళల నాగలూటి ప్రాంతాల వ్యాపిస్తుంది. అప్పుడే మామిడికాయలూ చిలకకొట్టులూ రాలడం ఆరంభం. చెంచువాళ్ళు ఆ కాయలూ పళ్ళూ తిని పొట్ట నింపుకుంటారు.

వేసవికాలములో నాగలూటి వద్ద మృగభయము కద్దు. రాత్రివేళ అప్పుడప్పుడు నీళ్ళు తాగడానికి ఒక్కొక్క పెద్దపులి ఆ ప్రాంతాలకు వస్తూ ఉంటుంది. అందుకోసరమే యాత్రికులు నిద్రమాని నెగళ్ళచుట్టూ కూర్చుంటారు.

నాగలూటి దగ్గిర చిన్న నీళ్ళకుండు (పుష్కరిణి) ఉన్నది. ఆ కుండులోకి ఎప్పుడూ పాతాళగంగ ధారగా వచ్చిపడుతూ ఉంటుంది. ఆ కుండులోనే యాత్రికులు స్నానము చేయడము ఆ నీళ్ళే ఆ గ్రామ

స్థులు తాగడము. ఆ నీళ్ళ కోసమే పెద్దపులులు రాత్రివేళ రావడము కూడాను.

నల్లమల కొండలు అరణ్యమయము. అక్కడక్కడ చెంచు గూడెములు చాలా కలవు. నాగలూటి అటువంటి చెంచుగూడెమే. ఈ కొండలోనే పుణ్యక్షేత్రములు కలవు. శ్రీశైల మన్నిటిలోను మహత్తు కలదని ప్రసిద్ధి కెక్కినది. శ్రీశైలము మీది రాళ్ళన్నీ శివలింగములేనట. శ్రీశైలము మీది చెంచులందరూ సిద్ధులేనట.

శ్రీశైలమునుబట్టి నల్లమలకొండలకూ అందలి అరణ్యములోని చెట్లకూ కూడా మహత్తు కలిగింది.

ఒకయేడు శివరాత్రికి శ్రీశైలము వెళ్ళి తిరిగివస్తూ కొందరు యాత్రికులు నాగలూటి సమీపాన వంట చేసుకొంటున్నారట. వారికి ఆ నాటికి ఒక చెవులపిల్లి ఆహారము కానున్నది. కుండలో దాని మాంస ముంచి కూర వండుతూ కలియబెట్టడానికి ఏమీ లేక కర్రముక్క పక్కను పడివుంటే దానితో ఆ కూర కలియబెట్టేసరికి కుండలోనుంచి చెవులపిల్లి బుడుంగున బయటికి దుమికి పారిపోయిందట. సంజీవినికున్న ప్రభావము నల్లమల కొండలమీది కొన్ని చెట్లకు కలదట.

చెట్లకే కాకుండా అక్కడ వాసముచేసే సిద్ధులకు కూడా యిటు వంటి మహత్తు కలదట

మనుష్యులకు ఆకలి లేకుండా ఉంటే ఎంత బాగుంటుందో, ఏ తాపత్రయమూ లేకుండా హాయిగా భగవన్నామస్మరణచేస్తూ కాలం గడపవచ్చునుగదా అనుకునేవాడు ఒక బ్రాహ్మడు. అతడు అగుపించిన బైరాగులనందరినీ ఆశ్రయించి ఆకలి లేకుండా చేసుకొందామని చాలా ప్రయత్నించినాడు. ఒకమారు అతడు నల్లమల కొండలలో ఒక సిద్ధుడిని చూచాడు. ఆ సిద్ధుడు ఏదో పసరు తాగించి ఆ బ్రాహ్మడికి ఆకలి లేకుండా చేశాడు. అప్పటికి సంతోషించినప్పటికీ ఆ బ్రాహ్మడు తరువాత పడ్డ ఆందోళన యింతా అంతా కాదు. భగవన్నామస్మరణ అంటుండగా తనకేదో జాడ్యము సంభవించినట్టు అతడు భావించి ఎన్నో మందులు మింగాడు. లాభము లేకపోయింది. తుదకొక బైరాగి అతనికి తటస్థ

పడ్డాడు. ఆ బైరాగి అతనికో మందిచ్చినాడు. ఆ మందు ప్రభావమువల్ల అతడు పూర్వము తానుతిన్న పసరు కక్కివేసినాడు. ఆ బైరాగి ఆ పసరు తాను తిని క్షుధను జయించి అంతరాయరహితమైన సమాధిలో ప్రవేశించాడు. నల్లమల కొండల ప్రభావము అట్టిదని లోకులు చెప్పు కొంటారు.

నాగలూటి గూడెములో చాలా వెదురు గుడిసెలున్నవి. కాని ఒక గుడిసె మాత్రము దూరముగా ఒక మామిడిచెట్టు కింద పుష్కరిణికి సమీపముగా ఉన్నది. ఆ గుడిసెలో ఒక చెంచెత ఒక చెంచు బాలుడూ కాపురమున్నారు.

చెంచుది ముసిలిది. నల్లని శరీరము. వయస్సులో అందకత్తె. ఇప్పుడు శరీరమంతా ముడతలు పడ్డది. చెంచుబాలుడు చామనచాయ రంగు, నీలిరంగు కళ్ళు, రాగి వెంట్రుకలు. చెంచుబాలునకు ఇరవై సంవత్సరముల వయస్సు. ఇతడు ముసలిదాని కొడుకే. పగలు వేటాడి తనకూ తన తల్లికీ సరిపోయినంత ఆహారము సంపాదించేవాడు. ముసలిది ఎప్పుడూ గుడిసెముందు ఏదో పరధ్యానముగా ఆలోచిస్తూ కూర్చుం టుంది. అక్కడ చెంచువాళ్ళందరూ ఆమెను చెంచురాణి అని పిలుస్తారు.

యాత్రికులు ఆమెను చూచి ఆమెను చెంచురాణీ అని పిలవడము విని ఆమె గొప్ప సిద్ధురాలని భావించి కొబ్బరి కాయలూ అరటిపళ్ళూ ఆవిడకు సమర్పిస్తూ ఉంటారు. ముసలిదాని దృష్టి వళ్ళమీదగాని యాత్రి కులమీదగాని ఎప్పుడూ పడలేదు. అప్పుడప్పుడామె యీరీతిగా గొణుగు కొనేది "సముద్రాలు, సముద్రాలమధ్య దేశం. దేశంలో ఊళ్ళు ఒక ఊళ్లో నా దేవుడు." యాత్రికులకు ఈ మాటలు అర్థమయ్యేవికావు.

ముసలిదానికి చిన్నతనములో తల్లిదండ్రులుంచిన పేరు లచ్చి. మధ్యకాలములో వచ్చిన పేరు బెస్సీ. అంత్యకాలములో వచ్చిన పేరు చెంచురాణీ. ఆమె కొడుకు పేరు వీరభద్రుడు.

ఆమె ఇతరులతో ఎప్పుడూ మాట్లాడకపోయినప్పటికీ కొడుకుతో అప్పుడప్పుడు ప్రసంగించేది. సముద్రాలుదాటి దేశాలుదాటి తనను తన కొడుకు తీసుకొని వెళ్ళగలడేమో అని అడిగేది. సముద్రాల మధ్య

దేవతల దేశాలు చూడడానికి అతనికి కుతూహలము ఉన్నదేమోనని కనుక్కొనేది. అక్కడ అడవులు ఉంటాయా అక్కడ వేటాడవచ్చునా అక్కడ చెంచువాళ్ళుంటారా అని అత డడిగేవాడు. అక్కడ మన దేవుడున్నాడు, పెద్దవాడవైనాక అక్కడకు నన్ను తీసుకొని వెళ్ళవా అని ఆమె ప్రశ్నించేది. వీరభద్రుడు ఆమె మాటలర్థముచేసుకొనలేక ఒక్కొక్కప్పుడు ప్రత్యుత్తరమిచ్చేవాడే కాడు.

ఉరు లొడ్డిపట్టి తెచ్చిన క్షుద్రజంతువులూ, కాయలూ పళ్ళూ ఊచబియ్యమూ తేనెపట్టులమైనమూ ఆమె దేహాన్ని పోషిస్తున్నవి. ఆమె హృదయమును పోషించడమునకు తన కొడుకు విగ్రహమూ తన ఆలోచనలూ ఉండేవి.

అప్పుడప్పుడామె నిట్టూర్పు విడిచేది. వాయువుకూడా అప్పుడే ఏ చెట్లసందునుంచో నిట్టూర్పు విడిచేది.

ఆమె అప్పుడప్పుడు కన్నీళ్ళు విడిచేది. చెట్ల ఆకుల నుండి అప్పుడే మంచుబిందువులు రాలేవి.

ఆమె అప్పుడప్పుడు కొడుకును కౌగిలించుకొని నీవే నా దేవుడవా అనేది. నేను కానసేవాడతడు. కాని ఆ మాటలామెకు వినబడకుండా వెదురు దుబ్బులు కీచుమని ధ్వనిచేసేవి.

ఆ ప్రాంతములలో నివాసముచేసే చెంచువాళ్ళందరూ వీరభద్రుణ్ణి చెంచురాణీ కొడుకనే పిలిచేవారు. అతనిని వాళ్ళందరూ గౌరవముగా చూచేవారు. వీరభద్రుడు వేటాడడములో చాలా నేర్పరి. విల్లమ్ములు పుచ్చుకొని అడవిలోకి వేటకువెళ్ళి అతడెప్పుడూ వట్టిచేతులతో ఇంటికి రాలేదు.

తాను అందరు చెంచువాళ్ళలాగా ఉండకపోవడమూ తననూ తన తల్లినీ అందరూ గౌరవముగా చూడడమూ అతనికి బోధపడినదికాదు. అందుకు కారణమేమైె ఉండునా అని అతడు చాలా మందిని అడిగాడు. ఏ కారణముచేతనో వాళ్ళు అతనికి సరియైన కారణము చెప్పారుకారు. తన తల్లి తప్ప ఇంకెవరూ తనకు చెప్పరని ఊహించి అతడు ఒకనాడు తల్లిని చెప్పవలసిందని తొందర పెట్టినాడు. తల్లి సందేహించి సందే

హించి తుదకు చెప్పింది. పాతాళగంగ కొండలమధ్య నుంచి ప్రవహిస్తూ ఉన్నదనీ ఆ పాతాళగంగ అక్కడకు తూర్పుగా ఎక్కడో అరణ్యము మధ్య కొండలలో మలుపు తిరిగినదనీ ఆ మలుపు దగ్గిర నీరు చలనము లేకుండా ఉంటుందనీ, ఆ మలుపు గుహవలె ఉంటుందనీ, దానిపేరు పీనుగులగొంది అనీ అక్కడకు వెళ్ళినట్లయితే ఇద్దరు చెంచువాళ్ళు కనిపిస్తారనీ ఆ చెంచువాళ్ళను కలుసుకొని తాను లచ్చికొడుకునని చెప్పి, లచ్చి సముద్రాల మధ్యకు వెళ్ళుతున్నదని చెప్ప వలసినదనీ, వాళ్ళే నీకు జన్మవృత్తాంతము యావత్తూ చెప్పుతారనీ ఆమె చెప్పింది. వీరభద్రుడికి అక్కడికి వెళ్ళవలెనని కుతూహలము కలిగినది. కాని తల్లిని ఒక్కర్తెనూ వదలిపెట్టి ఎలాగ వెళ్ళడం? చెంచురాణి ఆ సంగతి గ్రహించి తనకు అక్కడఉన్న చెంచువాళ్ళు తిండిపెట్టుతూ ఉంటారుకాబట్టి ఆ విషయమై అతడు బెంగపెట్టుకోవలసిన అవసరము లేదని చెప్పింది.

వీరభద్రుడు ప్రయాణానికి సిద్ధపడ్డాడు. విల్లమ్ములు తీసుకొన్నాడు. మొలలో పెద్దకత్తి దోపుకొన్నాడు. కట్టుకొన్నబట్టా పైమీద బట్టతోటీ బయలుదేరాడు. అడవులలో నడవడము ప్రారంభించాడు.

తెల్లవారుజామున బయలుదేరి బారెడుపొద్దు ఎక్కేసరికి పెద్ద చెరువు చేరుకున్నాడు. అక్కడ చెంచు గూడెము, లంబాడీ గూడెమూ ఉన్నవి.

ఆ గూడెములవైపు పోక అతడు తోవలో సంపాదించిన మామిడి కాయలూ, టుంకిపళ్ళూ, చింతగుల్లలూ తిని, చెరువులో నీళ్ళు దాహం తాగి ప్రయాణం సాగించాడు. తోవలో చెంచువాళ్ళు అతన్ని చూచి ఎవడో పరాయివాడు వచ్చాడనుకొని బద్దా అలుగులూ సర్దుకొన్నారు. సమీపమునుంచి చూచి చెంచురాణీ కొడుకు చెంచురాణీ కొడుకు అని అరుస్తూ పారిపోయినారు.

నడవగా నడవగా కృష్ణానది కానవచ్చినది. బండలమీద నుంచి మందముగా ప్రవహిస్తూవుంది. దానిగట్టునే అతడు నడిచిపోతున్నాడు. వెదురు దుబ్బులలో నుండి అడవికోళ్ళు కూయడం ప్రారంభించినవి. కోతులమందలు అతనిని చూచి ఒక బండమీద నుంచి ఇంకొక బండ

మీదికి దుముకుతూపోయే అదృశ్యమైనవి. తోవలో టేకుచెట్లూ, మద్దిచెట్లూ గొడుగు తుమ్మచెట్లూ, మంచిగంధపుచెట్లూ, వెదురు పొదలూ ఎన్నో ఉన్నవి. అతడు వాటిని చూడకుండా తల్లి సంగతీ తన సంగతీ తలచుకొంటూ వెళ్ళుతున్నాడు. సాయంత్ర మయ్యేసరికి శ్రీశైలము చేరుకున్నాడు. తోవలో చెంచువాళ్ళెవళ్ళూ అతనికి తటస్థపడలేదు. అతనికి ఆకలి వేసింది. కత్తితో ఒక ఈతచెట్టు పడగొట్టి దానిని నరికి మొవ్వ తిని ఆకలిదప్పులు అణుచుకొన్నాడు. శ్రీశైల దేవాలయానికి ఎదురుగా ఉన్న సత్రపు గదులలో ఆ రాత్రి నిద్రపోయాడు. రాత్రి నాలుగో జామునలేచి, నలిగిన బాటగుండా వెళ్ళినాడు. తోవలో వెలుగుబంట్లు అతన్నీ అతని విల్లునూ చూచి తప్పుకొన్నవి. జింకల మందలు చెంగుచెంగున దాట్లువేస్తూ పారిపోయినవి. చాలాదూరం నడిచిపోగా అతనికి పాతాళగంగ గోచరమైనది. పాతాళగంగను అనుసరించి అతడు నడిచిపోయాడు. చిటిచిటలాడుతూ ఎండ కాస్తున్నది. పాతాళగంగలో స్నానముచేసి కడుపునిండా నీళ్ళుతాగి ఒక బండప్రక్క నీడలో విశ్రమించాడు. అతనిచుటూ పెద్ద కొండలు; అక్కడక్కడ వెదచల్లినట్లు పెద్దపెద్ద రాళ్ళు. కొండలనిండా చెట్లు. పెద్దపులులు సంచారముచేసే చోటది. అతనికి అక్కడ కునుకు పట్టింది. ఎంతసేపు నిద్రపోయాడో తెలియదు. కళ్ళు తెరచేసరికి అతనికి ఎదురుగా ఉన్న బండమీద ఒక చెంచుపిల్ల కనపడినది. కళ్ళు నులుముకొని లేచికూర్చుని మళ్ళీ చూచాడు. నల్లని పడుచు చెంచుపిల్ల పదహారు సంవత్సరముల ఈడుగలది. అతనిని పరకాయించి చూస్తున్నది. ఆమె పక్క ఒక బుట్ట, బుట్టలో పళ్ళూ కాయలూ కత్తీ ఉరులూ మొదలైన వస్తువులున్నవి.

చెంచుపిల్లలో నుంచి లావణ్యము సూర్యబింబము నుంచి వచ్చే కిరణములలాగ వచ్చి అతని మనస్సు నాకర్షించింది. అతని మనస్సు మనస్సులో లేదు.

"నీవు చెంచువేనా ?" అని ప్రశ్నించింది చెంచుపిల్ల.

"అవును" అన్నాడు వీరభద్రుడు.

"మన మిద్దరమూ ఈ కొండలలో ఉండిపోదాము. నాతోకూడా ఉంటావా?"

"నీకు తల్లిదండ్రులు లేరా?"

"లేరు, ఉన్నారు. నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పవేం?"

"నాకు పీనుగుల గొంది చూపిస్తావా?"

"చూపిస్తే నా నేస్తమవుతావా?"

"మా అమ్మ నడుగుతాను."

"మీ అమ్మ ఎక్కడుంది?"

"నాగలూటిలో"

"నాగలూటిలో అడివేలేదు. ఇక్కడెంత అడవో! మనం స్వేచ్ఛగా తిరుగ వచ్చుకాదూ?"

"అవును."

ఈ రీతిగా కొంత సేపు సంభాషణ జరిగింది. వీరభద్రుడికి చెంచు పిల్ల కడుపునిండా పళ్ళు పెట్టింది. ఇద్దరూ కలిసి కేకలు వేసుకొంటూ పాతాళగంగ అవతలి గట్టుకు ఈదుకుపోయారు. ఏరుదాటి, అక్కడ కొండలు చుట్టుతిరిగి యిద్దరూ వెళ్ళుతున్నారు. తోవలో ఎన్నో ఊసులు కథలు చెంచుపిల్ల చెప్పింది. ఎన్నో పాటలు పాడింది. ఆ రాత్రి ఒక చెట్టుమీద గడిపారు కబుర్లు చెప్పుకుంటూను. తెల్లవారకుండా లేచి వాళ్ళిద్దరూ ప్రయాణం సాగించారు. నలగని బాటలగుండా యితరులకు తెలియని మార్గాలగుండా చెంచుపిల్ల అతన్ని తీసుకుపోయింది.

పాతాళగంగ కొండల మధ్యనుండి ప్రవహిస్తూ ఉన్నది. ఒక చోట పాతాళగంగకు అడ్డముగా పర్వతము నిలిచి ఉన్నది. కృష్ణానది ఆ పర్వతముచుట్టూ తిరిగి ప్రవహించవలసినచోటు ఇక్కడ. వరదల రోజులలో కృష్ణానది పర్వతమును పొడిచివేస్తూ ఉంటుంది. చాలా కాలము ఈరీతిగా చేయడమువల్ల ఆ కొండలో ఒక మోస్తరు గుహ ఏర్పాటైనది. వరదలు లేని కాలములో ప్రవాహము మందముగా ఉండడము చేత గుహలో నీళ్ళు చలనము లేకుండా ఉంటవి. నదిలోపడ్డ మ్రాకులు వగైరా అన్ని వస్తువులనూ కృష్ణానది యీ గుహలో దాచు

కుంటుంది. నదికి ఎగువను ఉన్నతమైన కొండ ఒకటి ఉన్నది. ఆ కొండకు సరాసరి క్రింద పాతాళగంగ. ఆ కొండ అంచున ఒక నున్నని రాయికలదు. ఆ రాతిమీద రెండు పాద చిహ్నములున్నవి. వాటికి "సిద్ధ రామయ్య పాదుక" లని పేరు. మోక్షము నాశించే యాత్రికులు ఈ పాదుకల మీద నిలబడి పాతాళగంగకు తమ్ము తామర్పించుకొంటారు. అటువంటి వారినందరినీ కృష్ణానది యీ గుహలోకి చేర్చుతుంది. దీనికే పీనుగులగొంది అని పేరు.

పీనుగులగొందికి అవతలివైపున ఒక చిన్న చెంచుగూడెమున్నది. ఆ చెంచుగూడెముకు నాయకులిద్దరు: గంగడు, గురవడు

చెంచుపిల్లా వీరభద్రుడూ కలిసి యీ గూడెము చేరుకున్నారు. చెంచుపిల్ల ఈ గూడెము వారికి చాలా పరిచితురాలే. గూడెములో స్త్రీ పురుషులు చెంచుపిల్ల స్వాతంత్ర్యము చూచి ముక్కుమీద వేలుంచుకుంటారు. వారి ఆచార వ్యవహారములతోగాని వారి కట్టుబాట్లతోగాని చెంచుపిల్లకు ఏమీ ప్రసక్తిలేదు. ఒకరి చెప్పుచేతులలో లేకుండా స్వేచ్ఛగా పెరుగుకువస్తూవుంది ఆ చెంచుపిల్ల.

వీరు గూడెము చేరుకునేసరికి గూడెములోని స్త్రీ పురుషులు చాలామంది వేటకు పోయారు. వీరభద్రుడూ చెంచుపిల్లా కలిసి దుబ్బులవెంట పచారు చెయ్యడం మొదలుపెట్టారు. సాయంకాలము వరకూ వారు ఆ ప్రాంతాల తిరిగి కడుపు నింపుకొని చివరకు గూడెము చేరుకొన్నారు.

ఒక రోజున చెంచుపిల్ల అక్కడ స్త్రీపురుషుల నందరనూ పోగు చేసి నాట్యమాడించింది.

గంగడూ గురవడూ వీరభద్రుడూ ఆ నాట్యములో చేరక కొంత దూరముగా ఒక బండమీద కూర్చున్నారు. వీరభద్రుడిని చూడడముతోనే అతను లచ్చి కొడుకని వాళ్ళిద్దరూ గుర్తించారు.

"నీవు ఇంతదూరం ఇప్పుడు రావడానికి కారణమేమి?" అని వాళ్ళడిగారు.

"మా అమ్మ సముద్రాల మధ్యకు వెళ్ళుతుందట. ఆ సంగతి మీతో చెప్పమన్నది" అని వీరభద్రుడు చెప్పాడు.

"గౌరిని నీ వెక్కడ చూచావు ?" అని వారడిగారు.

"గౌరి ఎవరు ?"

"నీతో వచ్చిన చెంచుపిల్ల."

"త్రోవలో తటస్థపడి నాకు దారి చూపించింది."

"అయితే నీ వదృష్టవంతుడవే !"

"ఎందుచేత ?"

"గౌరి ఇంతవరకు ఏ పురుషుడితోటీ కలిసిమెలిసి ఉండలేదు." వీరభద్రుడు మాట్లాడలేదు.

"గౌరి చిన్న చెంచురాణీ."

"మా అమ్మను చెంచురాణీ అనీ నన్ను చెంచురాణీ కొడుకనీ పిలవడానికి కారణమేమిటి ? అని వీరభద్రుడు అడిగాడు.

వారిద్దరిలో కొంచెము పెద్దవాడైన గంగడు ఆ వృత్తాంతమంతా వీరభద్రుడితో ఈ విధముగా చెప్పాడు.

లచ్చి చిన్నతనములో చాలా అందముగానూ చురుకుగానూ ఉండేది. ఆమె ఎక్కలేని కొండలూ చెట్లూ లేవు. పురుషులతో సమానముగా వేటాడుతూ మోటపనులు చేస్తూ ఉండేది. ఇంతేకాకుండా అడవులలో తిరిగి మందులూ మాకులూ సంపాదించి వైద్యము చేయడమే కాకుండా కొంతవరకు మంత్రములు కూడా నేర్చుకొన్నది. ఆ కారణము చేత చెంచువాళ్ళకు లచ్చి అంటే భయము భక్తి.

చిన్నతనములో లచ్చి నేనూ చాలా స్నేహముగా ఉండేవాళ్ళము. ఇద్దరమూ కలిసి వేటకు వెళ్ళేవాళ్ళము. ఇద్దరమూ ఏటిలో ఈదులాడేవాళ్ళము. ఇద్దరమూ నది ఒడ్డున పొంచుండి, ఇసుకలో పడుకోవడమూ మొసళ్ళు వచ్చినప్పుడు వాటిని ఉచ్చులతో పట్టుకొనేవాళ్ళము. అప్పుడు మాకు భయమంటే ఏమిటో తెలియదు. ఒక్కొక్కప్పుడు చాలా రోజుల వరకూ మేము అడవుల్లో వేటాడుతూ ఉండిపోయేవాళ్ళము.

ఆ కాలములోనే లచ్చి నన్ను పెళ్ళాడతానని చెప్పింది.

అప్పుడు చెంచువాళ్ళకు చాలా కష్టదినములు. అడవులలో పండిన పంటంతా అధికారులు తీసుకుపోయేవారు. మాకు తినడానికి తగిన తిండి

ఉండేదికాదు. ఎన్ని విధాలు తంటాలుపడ్డా మాకు ఆకలి అణిగేది కాదు. అప్పుడు మేమందరమూ ఆడువాళ్ళు మగవాళ్ళూ — ఆలోచించాము. మాలో గురవడు చాలా బుద్ధిమంతుడు. అనేకమంది అనేక సలహాలు చెప్పారు. తుదకు అప్పుడు తీర్మానించుకొన్నాము—అధికారులను అడవులలో కాలుపెట్టనివ్వకూడదని. అయితే ఆరీతిగా చెయ్యడం ఎలాగ? అందరూ ఆలోచించారు. ఎవరికీ మార్గం తోచిందికాదు. ఎవరైనా సరియైన మార్గం సూచించినట్లయితే వారిని లచ్చి పెళ్ళాడతాన్నది. గురవడు తాను చేస్తానన్నాడు. నాకు దుఃఖము కలిగింది. లచ్చిమీదా గురవడి మీదా నాకు కోపం వచ్చింది. పగలు తీర్చుకోడానికి సమయముకాదది.

గురవడు చెంచువాళ్ళ నందరినీ పదిజట్టులకింద విడదీసి ఒక్కొక్క జట్టుకు ఒక్కొక్క పెద్దను ఏర్పాటు చేశాడు. కొన్ని జట్టులను రోడ్లు కాయడానికి పంపాడు. కొన్ని జట్టులను అడవులలో ఉన్న అధికారుల మీదకు పంపాడు.

తరువాత గురవడు లచ్చిని పెళ్ళి చేసుకొన్నాడు. లచ్చి తల్లిదండ్రులకు నాలుగు జతల ఆవుల నిచ్చి లచ్చిని తీసుకుపోయాడు. ఒకనాడు రహస్యముగా లచ్చిని నేను కలుసుకొని చిన్నతనములో అది అన్నమాట జ్ఞాపకము చేశాను. లచ్చి నవ్వింది. ఈరీతిగా చెప్పింది. "చిన్నతనములో నిన్ను పెళ్ళి చేసుకొన్నాను. ఇప్పుడు గురవడిని పెళ్లి చేసుకొన్నాను. నా కిద్దరు భర్తలు ఉండకూడదా?" రహస్యముగా ఇద్దరు భర్తలుండకూడదని నేను చెప్పిన మాటలు పెడచెవిని పెట్టింది. పర్యవసానమేమి జరిగిందంటే — లచ్చి గురవడితో సంసారము చేస్తూ ఉన్నప్పటికీ మేమిద్దరము భార్యాభర్తలవలె ఉండడానికి నిశ్చయించుకొన్నాము. ఈ విషయము మాత్రము రహస్యముగా ఉంచాము.

ఆ రోజులలో చెంచువాళ్ళ ప్రతాపము లోకానికి వెల్లడయింది. రోడ్లమీద ఎవరు ప్రయాణము చేసినప్పటికీ వాళ్ళు చెంచువాళ్ళ అలుగులకు గురి అయ్యేవారు. మావాళ్ళందరూ అధికారులను దొరికినంత మట్టుకు హతమార్చారు. అడవి సమీపానికి రావడానికి అందరూ భయపడ్డారు. ఆ రోజులలో ఎందరిని చెంచువాళ్ళు చంపారో ఎందరిని చెర

పెట్టారో చెప్పడానికి వీలులేదు. అడవిరాజ్యం కొంతకాలం మళ్ళీ చెంచు వాళ్ళు ఏలారు. మా కప్పుడు కడుపునిండా తిండి దొరికింది. సంతోషించాము.

కాని తలవని తలంపుగా పోలీసుపటాలాలు అడవుల్లో ప్రవేశించినవి. మాకూ వాళ్ళకూ అనేక యుద్ధాలు జరిగినవి. మాకు అలుగులూ దబ్బలూను, వాళ్ళకు తుపాకులు. ఆ కారణముచేత చెంచువాళ్ళు చాలా మంది చచ్చిపోవడం సంభవించింది. అందువల్ల వాళ్ళు భయపడి పారిపోవడం మొదలు పెట్టారు. పోలీసువాళ్ళు వాళ్ళని అడవులలో జింకలను వేటాడినట్లు వేటాడారు. కొంతకాలానికి అడవిరాజ్యం చెంచువాళ్ళ వశం తప్పి తెల్లవాళ్ళ స్వాధీనమైనది. చావగా మిగిలిన చెంచువాళ్ళు తెల్లవాళ్ళ రాజ్యాన్ని ఒప్పుకోక తప్పిందికాదు. మాయలు పన్ని లంచాలిచ్చి ఒక తెల్లదొర చెంచునాయకులను కొందరిని పట్టుకొని ఉరి దీయించాడు. దానితో అల్లరులు సర్దుకొన్నవి.

చెంచువాళ్ళ కోపం చల్లార్చడానికీ, వాళ్ళల్లో మళ్ళీ కలవరం కలగకుండా ఉండడానికీ, వాళ్ళకు సరియైన జీతాలిచ్చి పని చేయించడానికి ఒక తెల్లదొర ఏర్పాటైనాడు. అతడు జాలిగుండెవాడు, మంచివాడు. అతడు నాగలూటి దగ్గిర బంగళాలో ఉండి అన్ని కార్యములూ న్యాయముగా చక్కపెట్టేవాడు. చెంచువాళ్ళ నందరినీ దయతో చూచేవాడు. వాళ్ళు కష్టసమయములో ఉన్నప్పుడు వాళ్ళకు డబ్బిచ్చేవాడు. చెంచువాళ్ళందరకూ అతడంటే గౌరవమూ భక్తీ కలిగినవి. అందరూ సంతుష్టిచెంది కాలక్షేపం చేస్తూన్నారు.

లచ్చి నాతో చనువుగా తిరుగుతున్నదనే సంగతి గురవడు గ్రహించాడు. గురవడు లచ్చీ కలిసి ఒకనాడు వేటకు వెళ్ళారు. నేనూ స్వతంత్రముగా వేటకు వెళ్ళాను. ఆరోజు మధ్యాహ్నము మే మొకచోట తారసపడ్డాము. గురవడికి నన్ను చూడడంతోనే కోపం వచ్చింది. నా మీదకు వచ్చిపడ్డాడు. మే మిద్దరమూ కలియబడ్డాము. లచ్చి నా పక్షము వహించింది. గురవడిని తోసిపారేసింది. గురవడు మాట్లాడకుండా వెళ్ళి

పోయాడు. ఆరోజున లచ్చి నేనూ సాయంకాలమయ్యేవరకూ అడవుల్లో తిరిగి యింటికి చేరుకొన్నాము.

గురవడు చెంచులలో పెద్దవాళ్ళనందరినీ పిలిచి తగువు పెట్టాడు. పెద్దలందరూ విచారణకు పూనుకొన్నారు. ఈ విషయము నిజమేనా అని నన్ను అడిగారు. నేను నిజమే నన్నాను. నిజమేనా అని లచ్చిని అడిగారు. నాయిష్టమని లచ్చి నిర్లక్ష్యముగా సమాధానం చెప్పింది. నేరము నిర్ధారణ అయినది కాబట్టి పెద్దలందరూ తీర్పుచెప్పారు. "గురవడి భార్యయైన లచ్చిని గంగడు మోసంచేసి తన భార్యగా చూచుకొంటున్నాడు కాబట్టి ఈ రోజునుంచీ గంగడే లచ్చిని ఏలుకోవలసి ఉంటుందనీ గురవడికి అపకారం జరిగింది కాబట్టి అతనికి గంగడు పదిహేను రూపాయలు దండుగ యిచ్చుకోవలసి ఉంటుందనీ" తీర్పు.

లచ్చి నావశమైనందుకు నేనూ లచ్చికూడా సంతోషించాము. కాని పదిహేనురూపాయల దండుగ ఇచ్చుకోవడమెలాగ? నావద్ద అప్పుడు ఒక్కరూపాయైనా లేదు. నాకు చెప్పతగ్గ ఆస్తి ఏమీలేదు. దండుగ యిచ్చుకోక పోయినట్లయితే నన్ను ఏమైనా వాళ్ళు చేయవచ్చును. ఏమీ చెయ్యడానికీ తోచక నేను లచ్చిని మాత్రం స్వీకరించి దండుగమాట తలపెట్టకుండా చాలారోజు లూరుకొన్నాను. చెంచు పెద్దలకు కోపం వచ్చింది. నన్ను శిక్షించడానికి చెంచువాళ్ళు సిద్ధపడుతున్నారు. నా బంధువులూ స్నేహితులూ నాపక్కనుండి నన్ను కాపాడుటకు ప్రయత్నిస్తున్నారు. అప్పుడు మాలో ఒక యుద్ధము జరగవలసినదే కాని తప్పిపోయింది. కారణమేమిటంటే .... ... ..

నాగలూటిలోఉన్న తెల్లదొరకు మా వివాదవృత్తాంతం తెలిసింది. అతడు వచ్చి సంగతి సందర్భములను తెలిసికొని వివాదమునకు కారణము పదిహేను రూపాయలే కదా అనుకొని ఆ రూపాయలు అతడు గురవడికి నా తరఫున ఇచ్చి వెళ్ళిపోయాడు. కాని ఒక చిక్కు తటస్థించింది. పదిహేను రూపాయలు ఎవరిస్తే వారికే లచ్చికూడా చెందవలసి ఉంటుంది. లచ్చి నాకే చెందవలసి ఉంటుందని నేను ఎంతచెప్పినా పెద్దలు చెవిని పెట్టారుకారు. అది అచారం అన్నారు. మరునాడు వాళ్ళు లచ్చిని

వెంటబెట్టుకొని తీసుకువెళ్ళి "ఈమె నీ భార్య" అని చెప్పి తెల్లదొరకు అప్పజెప్పారు తానిచ్చిన రూపాయలకు తనకీ ప్రతిఫలము ముట్టినదని తెల్లదొరకు వారు నచ్చచెప్పారు. తెల్లదొర ఆశ్చర్యపోయాడు. కాని తాను చెంచువాళ్ళ ఆచారములకు బద్ధుడైనట్లు తలచి విధికి తలవంచి ఊరుకొన్నాడు. అతడు బ్రహ్మచారి కూడాను. లచ్చి ఆనాటి నుంచి తెలదొర యింట్లో ఉండడము తటస్థించింది.

లచ్చిని చెంచుపెద్దలందరూ ఈరీతిగా చెయ్యడం నాకు కష్టమనిపించింది. గురవడికికూడా కష్టమనిపించింది. ఆ కారణముచేత అతనూ నేనూ స్నేహితులమయాము. తెలదొర దగ్గిరనున్న లచ్చిని తీసుకరావడానికి ప్రయత్నాలు చేశాము. అందువల్ల చెంచువాళ్ళందరికి మాట వస్తుందని మిగిలిన చెంచువాళ్ళు మమ్మలిని మందలించారు. అయినా చెంచు కుటుంబములో పుట్టిన చెంచుదాన్ని పరాయివాళ్ళ కర్పించడం న్యాయము కాదని వాళ్ళతో చెప్పాము. వాళ్ళు విన్నారుకారు. అప్పుడు మే మిద్దరమూ మా స్నేహితులను బంధువులనూ తీసుకొని, అక్కడ చెంచువాళ్ళని కులం తక్కువవాళ్ళని నిందించి, బయలుదేరి వచ్చి యిక్కడ — ఈ పీనుగులగొంది దగ్గిర ఒక గూడెము నిర్మించుకొని కాపురం చేస్తున్నాము. మా ఇద్దరికీ లచ్చిమీద అభిమానం పోలేదు. ఎప్పటికైనా దానిని మా వశం చేసుకోవలెననే ఆశతో ఉన్నాము.

లచ్చి దొరగారింట్లో ప్రవేశించింది. కొన్నాళ్ళ వరకూ లచ్చికీ దొరగారికీ సంభాషణ జరగలేదు. కాని అక్కడి నుంచి లేచి పారిపోయి వస్తే దొర ఏమిచేసిపోతాడో అని భయం. అది అటుండగా అక్కడ కూటికీ బట్టకూ లోటులేకుండా దివ్యముగా జరిగిపోతున్నది. అటువంటి భాగ్యము వదలిపెట్టడానికి కూడా ఆమెకు మనస్కరించిందికాదు. దొరగారు క్రమక్రమముగా లచ్చితో మాట్లాడడం మొదలు పెట్టారు. "నా ప్రియా, ఇటు వచ్చుము. నాకొక ముద్దు నిచ్చుము" అనేవారట. లచ్చికి విలువయైన బట్టలూ నగలూ మంచి మంచి ఆహారమూ పెట్టేవారట. దానాదీనా వారిద్దరికీ అన్యోన్యం కుదిరింది. ఇద్దరూ భార్యాభర్తలలాగ ఉంటున్నారని చెంచువాళ్ళకు తెలిసింది. చెంచువాళ్ళు దొరగారితో

మాట్లాడవలసి వచ్చినా, దొరగారితో తమ కష్టసుఖాలు చెప్పుకోవలసి వచ్చినా, దొరగారిని ఏమైనా కోరవలసివచ్చినా లచ్చి ద్వారానే ఆ పనులు చేసేవారు. లచ్చి క్రమక్రమముగా చెంచువాళ్ళందరకూ దేవత వంటిదైనది.

తెల్లదొర లచ్చిని "బెస్సీ, నా ప్రియా, బెస్సీ" అని పిలిచేవాడు. చెంచువాళ్ళ వ్యవహారాలు పరిష్కరించవలసి వచ్చినప్పుడల్లా తెల్లదొర తన బెస్సీ సలహా లేనిదే ఏపనీ చేసేవాడు కాడు. లచ్చి చెంచువాళ్ళందరికీ సాధ్యమైనంతవరకూ ఉపకారం చేసేది.

తెల్లదొరా బెస్సీ కలిసి అప్పుడప్పుడు, కొందరు చెంచువాళ్ళను తీసికొని, షికారు వెళ్ళేవారు. ఆ సమయాలలో బెస్సీ తుపాకీ గురి తప్పకుండా కాల్చడం నేర్చుకొన్నది. ఇది చూచి చెంచువాళ్ళు బెస్సీ అంటే భయముతో ఉండేవారు. ఆ రోజులలోనే చెంచువాళ్ళు లచ్చికి చెంచురాణి అనే పేరు పెట్టారు. దొరగారు కూడా ఈ మాట విని సంతోషించి చెంచురాణి అని ఆమెను పిలిచేవారు.

ఒకనాడు నేను గురవడూ కలిసి నాగలూటి వెళ్ళాము. అక్కడ కొన్నాళ్ళు వేచిఉండి సమయము కనిపెట్టి లచ్చిని రహస్యముగా కలుసుకొన్నాము. మేము కొత్తగా నిర్మించిన కొత్త గూడెముకు తీసుకొనిపోతే వస్తుందేమోనని అడిగాము.

లచ్చికి మామీద అభిమానం తగ్గలేదు. కాని మాతో వచ్చినట్లయితే దొర ఏమైనా చేసిపోతాడనీ, మాకే కాకుండా చెంచువాళ్ళందరకూ అది శ్రేయస్కరము కాదనీ ఏమేమో సాకులు చెప్పి తప్పించుకొన్నది. మా ప్రయత్నాలు నిష్ఫలమైనవి. అప్పుడు లచ్చి కడుపుతో ఉంది. దొర ఆవిడను రోజు రోజూ ఎక్కువ ఆదరముతో చూస్తున్నాడు. ఆ రోజులలో లచ్చిని కాలు కదపనిచ్చేవాడు కాడు. రాత్రింబగళ్ళు తన దగ్గిరే గడిపేవాడు. లచ్చికి దొర అంటే ఎక్కడాలేని ప్రేమ. ఇట్లా అన్యోన్యముగా ఉంటూ ఉండగా ఇంతట్లోకి తెల్లదొరకు బదిలీ అయినది. ఆ సంగతి లచ్చితో చెప్పి తననుకూడా తీసుకువెళ్ళమని ఎంతో ప్రార్థించింది. అది పొసగదన్నాడు దొర. చివరకు లచ్చి ఒప్పుకొన్నది.

[illegible] కొన్ని బహుమతులిచ్చి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. [illegible] ఒక్కర్తె ఆ ప్రాంతాల గుడిసె వేయించుకొని అందులో [illegible] ఉన్నది

ఈ సంగతి తెలిసి నేనూ గురవడూ కలిసి మళ్ళీ నాగలూటి వెళ్ళినాము. లచ్చి మమ్మలను చూచి కళ్ళనీరు పెట్టింది. మాతోరమ్మని అమెను కోరితే తన స్థితి మాతో చెప్పి రానన్నది. అప్పుడే ఒక తుపాకీ, ఒక వెండి సిగరెట్టు కేసూ, మూడు కాసులూ మా చేతికి జాగ్రత్త చేయ మని చెప్పి యిచ్చింది. తాను కోరినప్పుడు వాటిని తిరిగి ఇయ్యవచ్చునని చెప్పింది. నీవు వచ్చావు కాబట్టి నీకు వాటిని ఈరోజున అప్పచెప్పుతాము. నీవు ఆమె పుత్రుడవు కాబట్టి, అవి నీ తండ్రివి కాబట్టి నీకే చెందవలసి నవి. నీవు చిన్న శిశువుగా ఉన్నప్పుడు మేము మళ్ళీ నాగలూటి వెళ్ళి లచ్చిని రమ్మన్నాము. తెల్లదొర ఎప్పుడైనా ఆ ప్రాంతాలకు రావచ్చు ననీ అందుచేత తానక్కడనే ఉండవలెననీ ఎప్పటికైనా తాను తెల్లదొర దేశం వెళ్ళవలెననీ, తన కొడుకు పెద్దవాడైనాక తన్ను తప్పకుండా తన తండ్రి దగ్గిరికి తీసుకువెళ్లుతాడనీ ఏమేమో ఆటంకములు చెప్పింది. తెల్లదొరతో కాపురంచేసే రోజుల్లో అతడు తన దేశాన్ని గురించీ తన దేశస్థులను గురించీ వారి వేషభాషలు ఆచార వ్యవహారములను గురించీ ఆమెతో చెప్పాడు. అప్పటి నుంచీ లచ్చికి ఆ దేశం వెళ్లవలెననీ ఆ దేశంలో తన భర్తతో కూడా కాపురం చేయవలెననీ కోరిక."

వీరభద్రుడు తన తల్లి కథ ఆమూలాగ్రముగా విన్నాడు. తన పుట్టుక సంగతి తెలుసుకొన్నాడు. ఉండుండి తన తల్లి సముద్రాల మధ్యకు వెళ్లిపోతానని చెప్పడం అప్పుడతనికి బోధపడింది.

గౌరి యింతట్లోకి పరుగెత్తుకొనివచ్చి "ఇంతసేపూ ఏమి చేస్తు న్నావు నాకు కనిపించకుండా. రా నాట్యమాడదాం రా" అని చెయ్యి పట్టుకు తీసుకుపోయింది. చాలాసేపు వారు చెంచువాళ్లందరితో కలిసి ఆడుతూ సరదాగా కాలం గడిపారు.

వీరభద్రుడు ఆరోజుననే తుపాకి వగైరా వస్తువులు గంగడు, గురవళ్ల దగ్గిర పుచ్చుకొని యింటికి వెళ్లడానికి ప్రయాణమయ్యాడు. చెంచుపిల్ల కూడా వస్తాసన్నది.

వాళ్లిద్దరూ మరుసటి దినం ఉదయం ప్రయాణమయినారు. కొత్త దోవలగుండా చెంచుపిల్ల అతన్ని తీసుకుపోతున్నది.

ఆనాటి సాయంకాలం వారు ఒక కొండకొలను దగ్గర విశ్రమించారు. సంతోషముగా కబుర్లు చెప్పుకొన్నారు. చెంచుపిల్ల అక్కడ అప్పుడు తనను పెళ్ళిచేసుకోమని అతనిని కోరింది. "మీ తల్లిదండ్రులకు కట్నముకింద ఆవులను ఇస్తేనేకాని పేచీ వస్తుందేమో" అన్నాడు వీరభద్రుడు. "నన్ను అందరూ చిన్న చెంచురాణీ అంటున్నారు. నేనే అందరినీ శాసిస్తాను. నాకు చెప్పేవాళ్ళెవళ్ళూలేరు" అని ఆమె చెప్పింది.

"నీవు చిన్న చెంచురాణీ వయితే నీకంటె పెద్ద చెంచురాణీ ఒకతె ఉండవచ్చుగదా, ఆమె మాటలూ వినవా?"

"ఎవరు పెద్ద చెంచురాణి?"

"నా తల్లి"

"నిజంగా! అయితే వింటాను. అందుచేతనే నిన్ను పెళ్ళి చేసుకొందామని నాకు తోచింది."

"నేను నిన్ను పెళ్ళాడనంటే ఏమి చేస్తావు?"

"నిన్ను నేను పెళ్ళాడుతాను. నేను చిన్న రాణీని నా మాట నీవు వినాలి."

"పెళ్ళి చేసుకొన్న తరువాత కూడా నీ మాట నేను వినవలసి ఉంటే నేను పెళ్ళిచేసుకోను."

"అప్పుడు నీ మాట నేను వింటానులే" అని చెంచుపిల్ల అతనిని సమీపించి బతిమాలేటట్టు నిలుచున్నది. వీరభద్రుడు చిట్టచివరకు పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకున్నాడు. కాని తన తల్లితో చెప్పితేనేగాని

ముందుగా మాట యివ్వనన్నాడు. చెంచుపిల్ల కొంత సేపు కోపగించింది, కొంత సేపు ఏడ్చింది. అక్కడ నుంచి వెనక్కు వెళ్ళిపోతానన్నది. ఇక ముందు అతనికి తోవ చూపించనంది. ఇన్నీచేసి చివరకు అతని కంఠాన్ని కౌగిలించుకొని అక్కడ అప్పుడు తనను పెళ్ళిచేసుకుంటేనే గాని వదిలిపెట్టనన్నది. వీరభద్రుడు చివరకు ఒప్పుకొన్నాడు.

కొండసరస్సు నీళ్లల్లో నక్షత్రాలు ప్రతిఫలిస్తున్నవి. చెట్లకొమ్మల సందులలోనుంచి గాలి నెమ్మదిగా వీస్తున్నది. వెదురు పొదలలో రొదలు వినబడుతున్నవి. అప్పుడే పక్షి దంపతులు గూళ్లల్లో నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నవి. ఒక్క పక్షి మాత్రము కొమ్మమీద కూర్చుని చల్లగా పలుకుతున్నది. ఆ సమయాన ఆ స్థలాన ఆ చెంచుపిల్లకూ చెంచువాడికీ వివాహము జరిగింది. పెండ్లిపెద్దలులేని వివాహము, కట్నములులేని వివాహము జరిగింది.

మొదట మానవ దంపతులకు ఇటువంటి సందర్భములలోనే వివాహము జరిగి ఉంటుంది.

తమ వివాహము స్థిరపడినట్లు నిదర్శనముగా వారు ఒకరి నొకరు ముద్దు పెట్టుకొన్నారు. ఒక్కమారు ఒకరి కౌగిలిలో ఒకరు ఒదిగినారు. చెట్టుమీద పక్షి మరీ మధురముగా పాడింది.

తెలవారుజామున చెంచులిద్దరూ కిలకిలలాడుతూ కబుర్లు చెప్పకుంటూ నాగలూటి వైపు నడచివెళ్లారు. వారికి ప్రపంచమంతా కలకలలాడుతున్నది. నడక శ్రమగాలేదు. చెంచుపిల్ల మాటలలో, నడకలో, కథలలో అవయవములలో అంతటా ఉత్సాహమే; అంతా నవ్వే.

వారిద్దరూ నాగలూటి చేరుకున్నారు. వీరభద్రుడు తన గుడిసె దగ్గిరికి చెంచుపిల్లను తీసుకువెళ్లాడు. అక్కడ అతని తల్లి కనిపించింది కాదు. పొరుగు చెంచువాళ్లువచ్చి అతనితో చెప్పారు ఈరీతిగా. అతడువెళ్లిన మరునాడే చెంచురాణీ జబ్బుపడినదనీ ఆ జబ్బులోనే "నేను సముద్రాల మధ్యకు వెళ్లిపోతున్నా" అని ఉండుండి చెప్పి మరణించిందనీ.

వీరభద్రుడు చాలా సేపు దుఃఖించాడు. చెంచుపిల్ల అతనిని ఓదార్చింది మరునాడే వారిద్దరూ నాగలూటి పుష్కరిణిలో స్నానముచేసి దట్టముగా ఉన్న అడవులలో వన్యమృగములతోపాటు కాపురము చెయ్యడానికి వెళ్లిపోయారు.

వీరభద్రుడు ఇంకా విచారముగా ఉండడము చూచి చెంచుపిల్ల గౌరి అతనితో అన్నది "నీ తల్లి చెంచురాణీ సముద్రాలకు మధ్యకు పోయింది. నీ భార్య చెంచురాణీ నిన్ను వదలకుండా ఈ అడవులలోనే నీతో తిరుగుతున్నది. ఇంకా నీకెందుకు విచారం?

—:o:—